# స్పందన

"నా మీద మీ కెందుకండీ ప్రేమ?"

"జాలితో!"

"జాలితోనా?"

"అవును!"

"కారణం తెలుసుకోవచ్చా?"

"నీవు ఆడదానివి కాబట్టి"

"నా ఒక్కదానిమీదేనా మీ జాలి?"

"నీలాంటి వాళ్ళందరి మీద"

"మీ జాలి నా కవసరం లేదు"

"ఎందుకని?"

"ఆడవాళ్ళంటే అబలలనా?"

"అదీ కాదు"

"మీ మగాళ్ళ జాలి మీదే నేను బ్రతకడం లేదు"

"................."

"మీ జాలీ, ప్రేమా నాకొద్దు"

"వద్దంటే నా మనసు బాధపడుతుంది"

"మీ మనసు బాధపడుతుందని మీ జాలికి తలవంచాలా?"

"అలా అని కాదు"

"ఎలాగైనా సరే మీరు నా మీద జాలి చూపే అవసరం లేదు"

"నిన్ను ప్రేమించకపోతే నాకెన్నో కష్టాలు ఎదురవుతాయి!"

"మీ కెందుకు కష్టాలు?"

"సమాజం... మనుషులు!"

"ఈ కుళ్ళు సమాజం కోసం, కుత్సిత మనస్కులకు భయపడి మీరు నన్ను ప్రేమిస్తారా?"

"భయపడడం కాదు!"

"మరేమిటి?"

"................"

"మగజాతి అంతా అంతే! ఆడవాళ్ళంటే అదో రకం తేలిక భావం!"

"మగజాతినే నిందించడం బాగోలేదు!"

"నూటికో, కోటికో ఒక్కరుంటే ఏం లాభం?"

"మగజాతి మారాలని కోరుకుంటున్నారా?"

"అవును!"

"ఏ మార్పులు రావాలి?"

"ఆడవాళ్ళు కూడా మగవాళ్ళతో సమానమనే భావన రావాలి. వాళ్ళూ మీ లాంటి మనుషులే అన్న ఆలోచన రావాలి..."



"ఇంకా?"

"మీ మనసుల్లో ఆడవాళ్ళంటే ఇప్పుడున్న నీచమైన భావన తొలగిపోవాలి."

"ఆ భావన తొలగించుకుంటే మిమ్మల్ని ప్రేమించవచ్చా?"

"అసలు నన్నెందుకు మీరు ప్రేమించాలి?"

"నేను నీ భర్తను కనుక! నీవన్నా, స్త్రీజాతి అన్నా నాకు ఏనాడూ నీచ భావన లేదు కనుక. అనాదిగా స్త్రీ జాతి మీద మగవాడి ఆధిపత్యం సాగుతుండడం నేను ఖండిస్తున్నాను కనక?"

"................"

"ఇప్పటికైనా నిన్ను ప్రేమించవచ్చా?"

"మీలో నిష్కల్మషమైన హృదయముంటే మీ ప్రేమనాకు అంగీకారమే!"




ఈ మాటలన్నీ రెండు హృదయాలవా? ఒకే హృదయానిదా? వింటున్న నాకు అర్థం కాలేదు కాని నా హృదయం మాత్రం అలౌకికమైన ఆనందంతో నిండిపోయింది. ●

శ్రీనాధ శర్మ